# అవినీతి బురదలో తులసిమొక్క

-సంకేపల్లి నాగేంద్రశర్మ

సహకార అర్బన్ బ్యాంకులో అంచెలంచెలుగా కింది స్థాయి నుంచి పనిచేసి మేనేజర్ స్థాయికి ఎదిగిన నాదమునికి మరో రెండేళ్ళు సర్వీస్ వుండగా, ఆకస్మికంగా మరో బ్రాంచికి మేనేజర్‌గా వెళ్ళమని పోస్టింగ్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అక్కడి బ్రాంచి మేనేజర్ సిక్‌లీవుపై ఉన్నందున, వెళ్ళక తప్పదంటూ ఎండీ బదిలీ ఉత్తర్వులు చేతిలో పెట్టాడు. సహకార రంగంలోని బ్యాంకు కావడం వల్ల, ఛైర్మన్ మొదలు అందరూ డైరెక్టర్లను బ్యాంకు ఖాతాదారులే ఐదేళ్ళకొకసారి జరిగే ఎన్నికలలో ఎన్నుకుంటారు. ఎన్నికయ్యేవారు చాలా మటుకు రాజకీయాలలో ఆరితేరిన వారే. అందుకే సహకార బ్యాంకులలో రాజకీయాలు రాజ్యమేలుతుంటాయి. దానితోపాటు అవినీతి, అక్రమాలు యథేచ్ఛగా సాగిపోతుంటాయి. ఈ బ్యాంకులలో దొడ్డిదారిన అక్రమ నియామకాలు, రుణాల మంజూరీలు, ఆడిట్‌కు చిక్కని దుబారా వ్యయాలు, ఉద్యోగుల సస్పెన్షన్లు, బదిలీలు కొనసాగుతుంటాయి.

ఛైర్మన్ బ్యాంకు సిబ్బందిని బెదిరించి వారి పేరు మీదనే ఓడీ రుణాలు పొందుతుంటాడు. అలాగే డైరెక్టర్లు పైరవీలు చేస్తూ అస్మదీయులకు రుణాలు ఇప్పిస్తుంటారు. ఇదే అదనుగా సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తుంటారు. అందుకే చాలామటుకు సహకార బ్యాంకులు నష్టాలను చవిచూస్తూ, కుంభకోణాల్లో ఇరుక్కుపోయి ఒక్కొక్కటిగా మూతపడుతూనే వున్నాయి.

నాదముని సిన్సియర్. తన డ్యూటీని తానేదో రూల్ ఆఫ్ లా చేసుకోవడం జరుగుతోంది. ఎలాంటి పలుకుబళ్ళకు గాని, పైరవీలకు లొంగే రకం కాదని అందరికీ తెలుసు. కనుకనే ఆయనంటేనే తోటి ఉద్యోగులు, ఖాతాదారులు జాగ్రత్తగా మాట్లాడుతుంటారు. అందుకే ఆయన కొంతమందికి కంటగింపుగా మారిపోయాడు కూడా. నాదమునిని ఇరికించడానికి ఎన్నెన్నో ప్రయత్నాలు జరిగినా, ఆయన నిజాయితీ ముందు అవేవి పప్పులుడకలేకపోయాయి. ఏదో ఒకటి కారణం చూపించి కొత్తగా ఎన్నికైన ఛైర్మన్ నాదమునిపై బదిలీ అస్త్రం చాకచక్యంగా ప్రయోగించాడు. తమ అక్రమార్జనలకు అడ్డొస్తాడన్న నెపంతోనే కొత్త బాడీ తనను బదిలీ చేసిందని నాదముని అంతరంగానికి తెలిసిపోయింది.

❖ ❖ ❖

నాదముని రిటైరయ్యాడు. హెడ్ ఆఫీస్ కరీంనగర్‌లోనే అతనికి ఘనంగా వీడ్కోలు సభను ఏర్పాటుచేసి, బ్యాంకు ఛైర్మన్‌తో సహా డైరెక్టర్లు, సిబ్బంది సంఘం నాయకులు ఘనంగా జ్ఞాపికలు ఇచ్చి, శాలువాలు వేసి, పూలదండలతో ముంచెత్తారు. పావు తులం బంగారం ఉంగరంగా మార్చి కానుకగా ఇచ్చారు.

తెల్లారినుంచే బ్యాంకు హెడ్డాఫీస్ చుట్టూ నాదముని వేట మొదలైంది. కనీసం నెల, రెండు నెలలకన్నా రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆరు లక్షల రూపాయలు ఇవ్వక బ్యాంకు వారు సతాయించడం మొదలుపెట్టారు. ఇదేమి నాదమునికి అర్థం కాలేదు.

బ్యాంకు ఎండీ, నాదమునిని పిలిపించుకుని, "నీకు రావాల్సిన మొత్తంలో 20 శాతంగా ఛైర్మన్ మొదలు డైరెక్టర్లు కమీషన్‌గా ఇవ్వాలని అడుగుతున్నార"ని, ఏమంటావని ప్రశ్నించారు.

"తన వేతనం నుండే ఏళ్ల తరబడి మినహాయించుకున్న ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్), ఇతర బెనిఫిట్స్‌ను తానెందుకు ఇస్తానని, ఇది నా కష్టార్జితమని, న్యాయంగా తనకు రావాల్సిందే"నని మొత్తుకున్నాడు.

"అలా కాదయ్యా, వాళ్ళు ఆశపడుతున్నారు. నీవు ఎంతో కొంత తృణమో, ఫణమో ఇచ్చుకోకుంటే ఎలా" అని ఎండీ పట్టుబట్టాడు.

ఇలా అడిగేసరికి నాదముని నీళ్ళు నమలాల్సి వచ్చింది.

"అలా కుదరదు. మీరు రూల్స్ ప్రకారం నా రిటైర్‌మెంట్ బకాయిలు ఇవ్వాల్సిందే"నని పట్టుదలతో అన్నాడు.

"నీకు చెప్పాల్సింది నేను దాచుకోకుండా చెప్పాను. ఇహ నీ ఇష్టం, నేను మాత్రం రెండు నెలల లాంగ్ లీవుపై వెడుతామనుకుంటున్నాను. ఏమంటావ్?" అని ఎండీ ప్రశ్నించాడు.

"ఇక్కడ నీతి, అవినీతి అని అంటే నడవవు. నష్టపోవాల్సింది తుదకు నీవే"నని మరీ హెచ్చరించి, జాగుచేయకుండా ఆలోచించుకోమని చెప్పాడు.

ఇంటికొచ్చిన నాదమునికి దిమ్మె తిరిగిపోయింది. తనకిద్దరు కొడుకులు. ఒకడు ప్రయివేట్ కాలేజీలో ఎంబిఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు, మరొకడు ఇంజనీరింగ్ సీటుకోసం ఎంసెట్ రాశాడు. ప్రయివేట్ కాలేజీలో డొనేషన్ కట్టి చదివించాల్సి వుంది. ఇది డబ్బు కట్టి కొనే చదువులు. కిందటేడు జరిగిన బిడ్డ పెళ్ళిలో బాకీపడ్డ లక్ష రూపాయల కట్నం వియ్యంకుల వారికి చెల్లించాల్సి వుంది. ఈ దృష్ట్యా తనకు డబ్బులవసరం అత్యవసరమై పోయాయి. బ్యాంకువారు రిటైర్‌మెంట్ దశలో తనలాంటి వాడిని ఇంత ఇబ్బందిపెడతారని తాను కలలోనైనా వూహించుకోలేదు. తనకు న్యాయంగా రావాల్సిన మొత్తాలకోసం ఎలా వ్యవహరించాలో తెలియకుండా తలంతా కొట్టుకున్నాడు. చివరకు ఎలాంటి లంచాలు ఇవ్వకుండానే డబ్బును రాబట్టుకుందామని మనసుతోనే సంఘర్షించుకున్నాడు.

తెల్లారే జిల్లా సహకార శాఖాధికారిని కలుసుకుని, తనకురావాల్సిన బకాయిలు ఇప్పించమని వేడుకున్నాడు. స్వదస్తూరీతో రాసిన దరఖాస్తును అందజేశాడు.

"అలాగేనయ్యా" అంటూ, పామును చూసినట్లు ఎగాదిగా చూశాడు. ఓ చిన్న విషపునవ్వు నవ్వుతూ నాదముని దరఖాస్తును ఎండార్స్ చేసి, సంబంధిత ఉద్యోగికి ఇచ్చారు. "నీవిచ్చిన కాగితాన్ని బ్యాంకు ఛైర్మన్‌కు పంపించడమే. ఇందులో నే చేయాల్సింది మరికంత ఏముంటుంద"ని గులుక్కుంటూ అన్నాడు.

నెల రోజులు గడిచినా తన సమస్య కొలిక్కి రాకపోవడం నాదమునికి కష్టమనిపిస్తోంది. రిటైర్‌మెంట్ జీవితం ఏ చీకూ చింతా లేకుండా గడపాలనుకున్న తనకు ఈ అవాంతరాలు ఎంత తలనొప్పులు తెస్తున్నాయన్న ఆందోళనకు గురయ్యాడు.

తన రిటైర్‌మెంటు బిల్లులపై సంతకం చేయడానికై కనీసంగా ఐదువేల రూపాయలు సిబ్బంది చేతివాటంగా అడిగి అడిగీ మరీ వసూలు చేసుకున్నారు. తన పద్దును విడుదల చేయడానికి డైరెక్టర్ల బోర్డు సమావేశం నిర్ణయించాల్సి వుంటుందని, 'కొంతలో కొంతైనా వదులుకోక తప్పద'ని సిబ్బంది అంటుండటం నిస్సహాయుడు, సిన్సియరైన నాదమునిని ఎంతో బాధించినట్లయింది. తాను పనిచేసేటప్పుడు అవినీతి ఊబిలో వున్నా, బురదంటించుకోకుండా దిగి విరిసిన కమలంలా నెగ్గుకు రాగలిగాడు. కాని, లంచం ఇవ్వంది తన ఫైళ్ళు కదలని పరిస్థితి ఏర్పడడం పట్ల నాదముని తీవ్ర వేదనకు గురి కావాల్సి వచ్చింది. నీతి నిజాయితీగా మెలిగినందులకు తాను అవినీతి రూపంలో చెల్లించాల్సిన నష్టపరిహారమని అనుకున్నాడు. చేసేది లేక ఏదో ఒకటి చేయాలని నిశ్చయించుకున్నాడు.

కలెక్టర్ కలవాలని అనుకున్నాడు. లేదంటే టీవీ చానళ్ళకు, ఏసీబీ వారికి చెప్పాలనుకున్నాడు. కనీసంగా నైనా జిల్లాలో సత్తాగల అవినీతిని చెండాడే నాయకులను కాంటాక్టు కావాలని అనుకున్నాడు. ఈ వృద్ధాప్యంలో ఎవరి దగ్గరికి వెళ్ళినా తగిన రిస్క్ మానసిక వ్యథ తప్పదని నాదమునికి తెలిసి వచ్చింది.

'ఇప్పుడున్న షుగర్, బీపీలకు తోడుగా మరేదైనా కొత్త రోగాలు తెచ్చుకుంటావా' అని భార్య సత్యమ్మ అన్న మాటలు ఆయన చెవుల్లో మార్మోగుతున్నాయి. భార తీయుడు, అపరిచితుడు లాగా వ్యవహరించాలనుకుంటే నీకు ఏమైనా అయితే మేము ఏమైపోతామని ఆమె పెట్టిన శోకం, అరిగిపోయిన రికార్డులా కుంగతీస్తూనే వుంది.

ఏమైనా కానీయమని తనకు తెలిసిన మిత్రుడు ద్వారా అవినీతిని ఎదుర్కొనే నాయకున్ని కాంటాక్టు చేయగా, "ఏదో నీది పెద్ద కుంభకోణమైనట్లు మాట్లాడుతున్నావ్. లేనిపోని చిక్కులకు గురికావాల్సి వుంటుంది. ఏదో కొంత ఇచ్చి సర్దుబాటు చేసుకోరాదా" అని ఉల్టాగా అన్నాడానేత.

ఆ హితవాక్యాలు విన్న నాదముని, మరింత విస్మయంతో పాటు అయోమయానికి గురయ్యాడు. బలహీనులు, అవినీతిపరుల మీద దాడి ప్రభావం ఎలా వుంటుందో స్వానుభవంలోకి వచ్చిన నాదముని ఓ నిర్ణయానికి వచ్చాడు. ఈ చెల్లుబాటు కాని వ్యవహారాలకు స్వస్తిచెప్పి ఛైర్మన్‌నే చాంబర్‌లో డైరెక్ట్‌గా కలిసి తన పరిస్థితిని వివరించి, పది శాతంగా 60 వేల రూపాయలు ఇస్తానని రాజీపడ్డాడు. అతి కష్టంగా ఛైర్మన్ ఒప్పుకోవడంతో పక్షం రోజుల్లో నాదముని బకాయిలు సజావుగా చేతికి అందాయి.

'అవినీతి బురదలో నడుస్తూ, అదే వర్షంలో తడుస్తూ వుండేవాడికి తులసి మొక్క వాసన ఎవడికి అక్కరకు వస్తుందని, తన బాధ ఎలా అర్థమవుతుంద'ని అనుకున్నాడు. ఎంతైనా తాను తాత్కాలికంగా ఓటమి పాలైనా, తన ఆశయాలను విడిచేది లేదని శేషజీవితంలోకి అడుగిడిన నాదముని గట్టిగా నిర్ణయించుకున్నాడు. వచ్చిన డబ్బులతో పిల్లల ఫీజులు చెల్లించడానికై కాలేజీ వైపు నడక సాగించాడు. ■